క్లుప్తంగా

వైభవంగా లక్షపత్రి పూజలు



పూజలు అందుకున్న స్వామివారు

నిడదవోలు: స్థానిక రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారికి 643వ లక్షపత్రి పూజ, స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి అభిషేకాలు చేశారు. కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఆలయం వద్ద భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాచోడేశ్వరస్వామికి విశేష పూజలు



ఉమా చోడేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ చేశారు. అమ్మవార్లకు శ్రీ సూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామి వారికి బిల్వార్చన, రుద్ర హోమం చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన తిప్పాబొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, పద్మశ్రీ దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు.అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ప్రధానార్చకులు దేవరకొండ సాయి ప్రసాద్, కొతవరపు భాను, దేవరకొండ ఉమామహేశ్వరరావు పూజలను పర్యవేక్షించారు.

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: కార్తిక మాసం ముగియడంతో తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోట సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,25,053 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు.

బీమా ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలి

నల్లజర్ల: మండలంలో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులే బీమా ప్రీమియం సొమ్మును ఈనెల 31 లోగా చెల్లించి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ సూచించారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ.540, వరి పంటకు ఎకరానికి రూ.630 చొప్పున కామన్ సర్వీస్ సెంటర్ లేదా గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రంలో ఈ బీమా ప్రీమియం సొమ్ము చెల్లించాలన్నారు. రైతు ఆధార్ కార్డు,1–బీ, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబరు వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాలలో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



క్షతగాత్రుడు రామకృష్ణ

పెరవలి: జాతీయ రహదారిపై మండలంలోని ఖండవల్లి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఖండవల్లి గ్రామానికే చెందిన పులిదండి రామకృష్ణ (30) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. రామకృష్ణ సైకిల్‌పై జాతీయ రహదారి దాటే ప్రయత్నంలో ఉన్నాడు. ఇంతలో తణుకు నుంచి రావులపాలెం వైపు వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. దాంతో ఎగిరి రోడ్డుపై పడిన రామకృష్ణ తలకు, చేతికి బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తొలుత తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు చేయి విరిగిందని, తలకు బలమైన గాయం అయ్యిందని తెలిపారు. ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించారు.

దివ్యాంగుడికి సత్కారం

నిడదవోలు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మూరులో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీల క్యారమ్స్ విభాగంలో పట్టణానికి చెందిన దివ్యాంగుడు వంగా కృపానంద ప్రసాద్ జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించాడు. ఈమేరకు కృపానంద ప్రసాద్ ఆదివారం పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్ దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు బలగం విశాలాక్షి, జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ర్యాలి శివ, మదర్ థెరిసా దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు మునుకుటి బాలాజీ, కొప్పాక రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుకు రేటు వచ్చేనా!

- ఆశాజనకంగా నాటు పొగాకు తోటలు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- గతేడాది గిట్టుబాటు కాని వైనం
- ఈ ఏడాది తగ్గిన సాగు విస్తీర్ణం



నల్లజర్లలో సాగవుతున్న నాటు పొగాకు

నల్లజర్ల: మెట్ట ప్రాంతంలో రెండో వాణిజ్య పంట అయిన నాటు పొగాకు సాగు చేస్తున్న రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది నష్టాలు చవి చూసిన రైతులు ఈ ఏడాది సగానికి పైగా సాగు విస్తీర్ణాన్ని తగ్గించేశారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మండలంలో దాదాపు 350 హెక్టార్ల విస్తీర్ణంలో నాటు పొగాకును సాగు చేసేవారు. ప్రధానంగా నల్లజర్ల, ఆవపాడు, శింగరాజుపాలెం, మార్లెళ్లమూడి, దూబచర్ల, గంటావారిగూడెం తదితర ప్రాంతాల్లో నాటుపొగాకు సాగు ఎక్కువ. గతేడాది అకాల వర్షంతో పందిళ్లపై ఉన్న పొగాకు తడిసిపోయి నాణ్యత దెబ్బతింది. ధరలు కూడా దారుణంగా పడిపోయాయి. దాంతో కొంతమంది రైతులకు పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి రాలేదు.

దాంతో చాలామంది రైతులు నాటు పొగాకు సాగుకు స్వస్తి పలికారు. ప్రత్యామ్నాయంగా వారంతా వేరుశనగ, మినుము, మొక్కజొన్న పంటల సాగు వైపు మళ్లారు. ఈ క్రమంలో నల్లజర్ల మండలంలో సగానికి పైగా నాటుపొగాకు సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడులు అవుతున్నాయని, కనీసం మూడు పుట్ల దిగుబడి (పుట్టుకు 60 కిలోలు) వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. గతేడాది కేవలం నామ మాత్రపు ధర వచ్చిందని ఈఏడాది పుట్టు నాటు పొగాకుకు కనీసం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ధర పలక వచ్చునంటున్నారు. ఆ ఆశతోనే ఈఏడాది ముందడుగు వేసినట్టు రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంత పొగాకుకు రంగు, రుచి, ఉండడంతో ఇతర రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉంది.

గతేడాది నష్టపోయాం



గతేడాది నాటు పొగాకు సాగు చేసి ఆర్థికంగా నష్టపోయాం. రెండు,మూడు నెలలు ఇంటి వద్ద పొగాకు ఉండిపోయింది. ప్రత్యామ్నాయ పంటలు లేక ఇదే సాగుపై ఆధారపడి పోయాం. ఈఏడాది ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించి నాటు పొగాకు సాగు తగ్గించాం. ఈఏడాది రెండున్నర ఎకరాలలో మాత్రమే నాటు పొగాకు సాగు చేశారు.

– పాతూరి సత్యనారాయణ, రైతు, నల్లజర్ల

ప్రభుత్వం ధర కల్పించాలి



నాటు పొగాకుకు సరైన మార్కెట్ సౌకర్యం లేదు. దళారులు చెప్పిందే ధరగా ఉంది.రైతులంతా దళారులపైనే ఆధారపడవలసి వస్తోంది. సరకు కొనుగోలు చేశాక రెండు, మూడు నెలలకు గాని రైతు చేతికి సొమ్ము అందడం లేదు. ప్రభుత్వమే నాటు పొగాకుకు మార్కెట్ సదుపాయం కల్పించాలి.ఈ ఏడాది పంట ఆశాజనకంగానే ఉంది.

– ఆలపాటి రాంభాస్కరరావు, రైతు, నల్లజర్ల

జెడ్పీ హైస్కూల్లో తుప్పల తొలగింపు



ముళ్లపొదలతో నిండి ఉన్న యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం (నాడు)



ముళ్లపొదల తొలగింపు అనంతరం పాఠశాల ప్రాంగణం (నేడు)

ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

సాక్షి ఇంపాక్ట్

దేవరపల్లి: యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రాంగణంలోని తుప్పలు, ముళ్లపొదలను తొలగించారు. 'పాముల బడిలోనే పాఠాలు' అనే శీర్షికన గత నెల 9న సాక్షిలో ప్రచురితమైన కథనానికి గ్రామస్తులు స్పందించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి అభివృద్ధికి తమ ప్రయత్నాలు ప్రారంభించారు. స్థానిక 3 ఎఫ్ ఆయిల్ పామ్ పరిశ్రమ యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. యాజమాన్యం స్పందించి పాఠశాల ప్రాంగణం అభివృద్ధికి ముందుకు వచ్చింది. ప్రాంగణంలోని ముళ్లపొదలు, తుప్పలు, పూర్తిగా తొలగించి రోటోవీటర్‌తో చదును చేశారు. సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చిన ఆయిల్‌పామ్ పరిశ్రమ యాజమాన్యానికి గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దోర్భల ప్రభాకర శర్మ

దేవరపల్లి: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందువులందరూ తరలి రావాలని వీహెచ్‌పీ గోవూరు ఖండ అధ్యక్షుడు దోర్భల ప్రభాకర శర్మ పిలుపు నిచ్చారు. యర్నగూడెంలోని షిర్డీ సాయిబాబా మందిరం వద్ద ఆదివారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభాకరశర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ హిందువులకు తమ దేవాలయాలను తాము నిర్వహించుకునే స్వాతంత్ర్యం రాలేదన్నారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ చట్టసవరణ చేయాలని డిమాండ్‌చేశారు. దేవదాయ, ధర్మాదాయ శాఖలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని, పూజా ప్రసాదాల కైంకర్యం సేవలు అత్యంత భక్తితో నాణ్యతతో నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ ప్రమేయం లేని హిందూ దైవభక్తులు మాత్రమే ఉండాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మండల కన్వీనర్ బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోల రామకృష్ణ, గన్నాబత్తుల కృష్ణ, బొట్టు రామకృష్ణ, సతీష్, పోతుల కాశీవిశ్వనాథం, పుట్టా శ్రీను, తిరుపతి లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల దొప్పలతో సహస్ర దీపార్చన



దేవరపల్లిలో సహస్రదీపార్చన చేస్తున్న భక్తులు

దేవరపల్లి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి నిమ్మకాయల దొప్పలతో సహస్ర దీపార్చన నిర్వహించారు. తొలుత స్వామి వారికి ఎర్ర గులాబీలతో సహస్ర నామార్చన, కాలసర్పదోష నివారణార్థం రాహుకేతువుల పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అఖండ వంశీకృష్ణ దీపార్చన చేశారు.

చెక్ పోస్టు దారి చెక్ పోస్టుదే!

- యథావిధిగా మట్టి అక్రమ రవాణా..
- పోలవరం కుడి కాలువ గట్లను కొల్లగొడుతున్న అక్రమార్కులు



మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్

నల్లజర్ల: పోలవరం కుడి కాలువ గట్లను పట్టపగలే అక్రమార్కులు కొల్లగొట్టి మట్టిని తరలించి, అమ్మిసొమ్ము చేసుకుంటున్నారంటూ 'సాక్షి' లో గత నెలలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు గత నెల 30న మండలంలోని ఆవపాడు, మారెళ్ళమూడి శింగరాజుపాలెం సమీపంలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు.ఈ చెక్‌పోస్టు 24 గంటలూ పని చేస్తుందని అధికారులు ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మట్టి దందా సాగనివ్వబోమని అధికారులు ముక్త కంఠంతో తేల్చి చెప్పారు. దీంతో గత ఐదు మాసాలుగా జనసేన, టీడీపీ భాగస్వామ్యంతో సాగుగుతున్న మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిందని అంతా భావించారు. ఇది మూన్నాళ్ల ముచ్చటగానే ఉంది. వారం తిరిగే లోపు అక్రమార్కుల మళ్లీ మట్టిదందా మొదలైంది. ఆదివారం అధికారులు ఎవరూ ఉండరన్న కారణంతో ఉదయం నుంచే టిప్పర్ల ద్వారా ఏలూరు జిల్లా నారాయణపురానికి యథావిధిగా మట్టిని రవాణా చేస్తున్నారు. పోలీసులకు చెబితే 'అది మా బాధ్యత కాదు'. 'రెవెన్యూవారు పట్టిస్తే కేసులు నమోదు చేస్తాం' అని చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖ వారు అసలు కనపడే పరిస్థితి లేదు. మట్టి అక్రమ రవణా విషయాన్ని రెవెన్యూ శాఖ వారికి చెబితే గ్రామ పంచాయతీలు బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారని సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరావు వెల్లడించారు. పరోక్షంగా అధికారులే ఈ మట్టి దందాకు సహకరిస్తున్నాని ఆమె ఆరోపించారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టరును కలసి అధికారులపైన, సిబ్బంది పనితీరుపైన ఫిర్యాదు చేయనున్నట్టు ఆమె తెలిపారు.

మృతుల కుటుంబాలకు వాసుబాబు పరామర్శ



మాజీ ఎంపీటీసీ జయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

నల్లజర్ల: మండలంలోని సింగరాజుపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యులు వామిశెట్టి జయలక్ష్మి, దొండపాటి సరయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదివారం పరామర్శించారు. డాక్టరు పి.బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మరడాని మంగారావు, దొండపాటి కేశవరావు, ఆది పెదగంగబాబు, అచ్యుత గంగేశ్వరరావు తదితరులు కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు. కాగా సింగరాజుపాలేనికే చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు కొఠారు సత్యనారాయణ చౌదిరి అత్తగారు పారమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కూడా వీరంతా పరామర్శించారు.

ఎక్కువ కేసుల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: ఈనెల 14న నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ఇన్సూరెన్స్ న్యాయవాదులు తమవంతు తోడ్పాటు అందించాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. పట్టణంలోని కోర్టు హాలులో ఆదివారం ఆమె ఇన్సూరెన్స్ న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.రాజీ పడదగిన అన్ని రకాల కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా ఖర్చులను ఆదా చేసుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీల కేసులు సాధ్యమైనన్ని ఎక్కువ రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు తమ వంతు కోర్టుకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

నిడదవోలు: పట్టణ శివారు ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నిడదవోలు – చాగల్లు ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఉండ్రాజవరానికి చెందిన వృద్ధ దంపతులు గాలింకి జానకీరావు, పుప్పాలు దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బంధువుల ఇంటికి వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి బయలు దేరారు. నిడదవోలు పట్టణ శివారున పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి వీరి బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ యువకుడి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధ దంపతులు బైక్ పై నుంచి ఎగిరి కింద పడి, తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ ఎస్సై టి.శోభన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి తాడిమళ్లలో పింఛన్ల తనిఖీ

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ప్రభుత్వ పింఛన్లను ఈనెల 9, 10 తేదీలలో తనిఖీ చేయనున్నారు. దివ్యాంగులతో పాటు వివిధ సామాజిక పింఛన్లు అనర్హులు పొందుతున్నారని భావించిన రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా తొలి విడతలో లబ్ధిదారుల పింఛన్లను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. సచివాలయ పరిధిలో ఉన్న పింఛనుదారుల ఇంటికి పక్క మండలాల అధికారులు వచ్చి పరిశీలించనున్నారు. కఠిన నిబంధనలు పెట్టి అర్హుల పింఛన్లను తొలగించేందుకు ఈ తనిఖీలు చేపట్టిందని పింఛన్‌దారులు విమర్శిస్తున్నారు.

12 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

ఉండ్రాజవరం: మండలంలో ఈ నెల 12 నుంచి జనవరి 7 వరకూ రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. 12న వెలగదుర్రు, దమ్మెన్ను, 13న కాల్దారి, 17న మోర్త, 19న సూర్యారావుపాలెం, పసలపూడి, 20న చివటం, వడ్లూరు, 24న సత్యవాడ, చిలకపాడు, జనవరి 3న పాలంగి, కె.సావరం, 4న తాడిపర్రు, 6న వేలివెన్ను, 7న ఉండ్రాజవరం గ్రామ సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. మండలంలోని రైతులు తమ భూ సంబంధిత సమస్యలను ఈ రెవెన్యూ సదస్సు ద్వారా అధికారులకు తెలియపరిచి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

అనంతపల్లి శివార్లలో తాటాకిల్లు దగ్ధం



బాధిత కుటుంబానికి బియ్యం, దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న వీఆర్వో రామసీత

నల్లజర్ల: అనంతపల్లి శివార్లలో ఆదివారం తెల్లవారుజామున ఓ తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. కుటుంబ యజమాని వెలగాని దుర్గారావు వ్యవసాయ కూలీ. ఇంట్లో అందరూ నిద్రిస్తుండగానే ఈ ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో మెలకువ వచ్చిన కుటుంబ సభ్యులందరూ ఆదరాబాదరాగా బయటకు వచ్చేశారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి అంతా కాలిబూడిదైంది. ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. వీఆర్వో రామసీత ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. 25 కిలోల బియ్యం, కందిపప్పు అందజేసి తన సొంత ఖర్చులతో ఆ కుటుంబానికి దుస్తులు, దుప్పట్లు సమకూర్చారు.

కోడి పందేలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందింది. దాంతో గ్రామానికి వెళ్లి దాడి చేయగా ఇద్దరిని అరెస్టు చేసి, రెండు పందెం కోళ్లు, రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపారు.

శశి ఇంజినీరింగ్‌కు నాక్ ఎ ప్లస్ గ్రేడ్



నాక్ ఎ ప్లస్ గ్రేడ్ అందుకున్న శశి కళాశాల, యాజమాన్యం, సభ్యులు తదితరులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ విద్యా సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (నాక్) నుంచి ఏ ప్లస్ గ్రేడ్ అందుకుంది. కళాశాలలోని విద్యా నాణ్యత, అధ్యాపకులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనలో ఉన్నత ప్రమాణాలు, సామాజిక కార్యక్రమాలు తదితర అంశాలపై నాక్ బృంద సభ్యులు నివేదికను అందజేశారు. శశి కళాశాలకు 2029 వరకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ కేటగిరీ కేటాయించారు. ఈ సందర్భంగా అడ్వైజరీ సభ్యులకు, అధ్యాపక బృందానికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

డేంజర్.. యమ డేంజర్

- అధ్వానంగా నిడదవోలు – నరసాపురం ఆర్ అండ్ బి రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- గుంతలు కూడా పూడ్చని కూటమి ప్రభుత్వం



ఉసులుమర్రు వద్ద ఆర్ అండ్ బీ రహదారిపై లేస్తున్న దుమ్ము



కానూరు వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతుల నుంచి పైకి కనిపిస్తున్న రాళ్లు

పెరవలి: నిడదవోలు – నరసాపురం ఆర్ అండ్ బీ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో అడుగడుగునా గోతులే దర్శనమిస్తాయి. దానికితోడు భారీ వాహనాలు వెళుతున్నపుడు రోడ్డుపై నుంచి వెలువడుతున్న దట్టమైన దుమ్ము వల్ల వెనుక వాహన చోదకులకు రోడ్డు కనిపించడం లేదు. ఫలితంగా తరచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేగాకుండా ఈ రోడ్డు పొడవునా పెద్ద పెద్ద రాళ్లు లేచిపోయి ఉన్నాయి. భారీ వాహనాలు వెళుతున్నప్పుడు వాటి వేగానికి ఆ రాళ్లు వెనుక, ముందు, రోడ్డుపక్కనే ఆగిన వారి మీద పడుతున్నాయి. ఫలితంగా వారు గాయాల పాలవుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నామని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ప్రధానంగా ఈ రోడ్డు ఉసులుమర్రు, కానూరు, తీపర్రు గ్రామాల మధ్య మరీ అధ్వానంగా తయారైంది. ఇక్కడ రోడ్డుపై గోతులు ఏర్పడడంతో రాళ్లు లేచిపోయి ఉండడం వలన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడు నెలల్లో ఈ రహదారిపై ఏర్పడిన గోతుల్లో 45 ప్రమాదాలు జరిగాయి. 17 మంది క్షతగాత్రులయ్యారు. వారిలో ముగ్గురు మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. దెబ్బతిన్న రోడ్ల గోతులు పూడ్చేందుకు నిధులు మంజూరు చేశామని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఆరు నెలలు గడుస్తున్నా కనీసం ఒక్క రాయి కూడ వేసిన పాపానపోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా మేల్కొని రోడ్డు వేయకపోయినా కనీసం గోతులు పూడ్చాలని కోరుతున్నారు.